# సింగిల్ పేజీ కథలు

## విందుభోజనం



గీతాపారాయణలో మునిగిపోయిన నాకు కోడలి పిలుపు వినబడలేదు.

"మావయ్యగారూ మిమ్మల్నే, ఆ వ్యాసపీఠం పక్కన పెట్టి నేచెప్పేది వింటారా?" అంది.

"చెప్పు తల్లీ"

"ఇవాళ మా స్నేహితురాలి కూతురి పెళ్ళి, మేం వెదుతున్నాం. మీరు కూడా రండి"

"నేనెందుకమ్మా మీరెళ్ళి రండి. నేనేదో కృష్ణారామా అనుకుంటూ ఇంట్లో ఉంటాను. నాక్కాస్త చారూ అన్నం వండిపెట్టు. పైగా బాగా దూరం కూడాను"

"దూరానికి మీరేమైనా నడవాలా? లేకపోతే మిమ్మల్ని మేం ఎత్తుకోవాలా? కార్లోనే కదా! అయినా రాత్రి నేను ఇంట్లో వంట పెట్టదల్చుకోలేదు. మీ రామకృష్ణులిద్దరూ ఎక్కడికీ పోరు. కాస్త బయట ప్రపంచం చూద్దురుగాని, త్వరగా తయారవ్వండి"

నా సమాధానం కోసం చూడకుండా మాట్లాడుతూనే గదిలోకెళ్ళింది కోడలు.

"అక్కడెవరూ నాకు తెలీదురా" అప్పుడే గదిలోంచి బయటికి వస్తున్న అబ్బాయితో అన్నాను.

"తెలీదానికేముంది నాన్నగారూ! మనం అందరితో సోషల్‌గా మూవ్ అయితే వాళ్ళే మనల్ని పరిచయం చేసుకుని చక్కగా కలిసిపోతారు. కాస్తయినా సిటీ కల్చర్ నేర్చుకోండి నాన్నా"

లేచి ముఖం కడుక్కుని గ్లాస్కో పంచె కట్టుకుని తిరునామం దిద్దుకుని తిరునాళ్ళకెళ్ళే బడిపిల్లాడిలా హాల్లో బుద్ధిగా కూర్చున్నాను. ఎంతైనా రిటైరయిన బడిపంతుల్ని కదా! మారుమూల లంకనుంచి వృద్ధాప్యంలో ఆసరా కోసం కొడుకు దగ్గరకొచ్చిన నాకు సిటీలో పెళ్ళికెళ్ళడం ఇదే మొదటిసారి.

ఇంతలో పన్నెండేళ్ళ మనవడు చక్కగా తయారై నా దగ్గరకొచ్చి ఎగాదిగా చూసి "నువ్వు ఏం ఉద్యోగం చేసేవాడివి?" అన్నాడు.

"బళ్ళో టీచరుగా చేసి రిటైరయ్యారా" అన్నాను.

"మరి నేనేమో గుళ్ళో పూజారిగా చేసి రిటైరయ్యావనుకున్నాలే. ఎప్పుడూ పంచెకట్టుకుని నామం పెట్టుకుని ఏవో మంత్రాలు చదువుతూ ఉంటావుగా. అయినా మీ డేడీ నీకెప్పుడూ పేంట్లు కొనివ్వలేదా తాతా?"

"లేదురా తాతా?"

సరిగ్గా మేం వెళ్ళేసరికి వధూవరులిద్దరూ జీలకర్ర బెల్లం ఒకరితలపై ఒకరు పెట్టుకుంటున్నారు. ఒకపక్క సన్నాయి మేళం, ఓ పక్క బేండుమేళం హోరెత్తించేస్తున్నాయి.

పెళ్ళిమండపం దగ్గర బంగారు కాసులు పంచుతున్నారా అన్నట్టుగా మండపం చుట్టూ జనం పోగయ్యారు వధూవరులకు బహుమతులివ్వడానికి.

ఇంతలో అబ్బాయి వచ్చి "నాన్నా డైనింగ్ హాల్లోకి పదండి, త్వరగా భోం చేసి బయలుదేరుదాం. మళ్ళీ రెండు గంటలు ప్రయాణం కదా" అంటూ జనసందోహంలో కలిసిపోయాడు. అక్కడే ఉన్న మనవడి చేయందుకుని నేనూ వాళ్ళని అనుసరించాను.

"ఎక్కడరా ఇంకా ఆకులేసినట్టు లేరు" అన్నాను వాడితో.

"అయ్యో తాతా ఆకులో పెట్టరు. మనమే ప్లేట్ తీసుకుని మనకి కావాల్సినవి వడ్డించుకోవాలి. రా..రా..మళ్ళీ ఐటమ్స్ అయిపోతాయి" అంటూ ఓ బరువైన గాజుపళ్ళెం నా చేతిలో పెట్టాడు.

హాయిగా పీట వాల్చుకుని ఔపోసన పట్టి అరిటాకులో భోం చెయ్యడం నాకలవాటు. ఇంత బరువైన 'పళ్ళెం' పట్టుకుని నేనూ అందరితోపాటూ క్యూలో నిలబడ్డాను. ఆ క్షణంలో నాకు జైల్లో చిప్పకూడు గుర్తొచ్చింది. ఒక్కసారిగా పందిట్లో జనమంతా భోజనాల హాల్లోకి వచ్చేసినట్లున్నారు. అక్కడంతా గందరగోళం. ఎవరిమటుకు వాళ్ళకి తొందరగా తిని ఇంటికి చేరుకోవాలనే తాపత్రయం కాబోలు. ఎవరి ప్లేట్లో ఎవరు చేతులు పెడుతున్నారో తెలీనంతమంది ఉన్నారక్కడ.

అక్కడున్న ఆ పేరుతెలీని పదార్థాలు చూస్తే నవ్వొచ్చింది నాకు.

అక్కడక్కడ చిన్న చిన్న గుడారాల్లో పదార్థాలు పేర్చి ఉంచారు. ఒక్కొక్క గుడారానికి ఒక్కో పేరులా ఉంది. 'చాటువులు ఇక్కడా?' అన్నాను మనవడితో.

"అయ్యో తాతా ఇవి చాటువులు, పద్యాలు కావు. చాట్ అంటారు. వీటిని తిని చూడు" అన్నాడు. నీళ్ళలో తేలేవి, పాలల్లో మునిగేవి ఎన్నో ఉన్నాయక్కడ. నాకు నచ్చినవి ఓ రెండు పళ్ళెంలో వేసుకున్నాను. ఓ పక్క ఆ ప్లేటు బరువుకి చెయ్యి లాగుతోంది. ఆ పదార్థం నోట్లో పెట్టుకుందామనుకునేలోపు గుర్తొచ్చింది. పళ్ళసెట్ నోట్లో లేదని. మెల్లిగా జేబులోంచి తీసుకుని పెట్టుకునేంతలో వెనుక నుంచి తోపులాట. ఆ హడావిడిలో పళ్ళసెట్‌లో ఒకటి నా నోట్లో ఉంది. మరోటి నా చేతిలోంచి నా పక్కనున్న ఆసామీ పళ్ళెంలో పడింది. అతను కెవ్వున కేకవేసి పళ్ళెం వదిలేసాడు.

"ఎందుకు మాస్టారూ ఇంట్లో కృష్ణారామా అనుకోక కల్చర్ తెలీకుండా వచ్చి చంపుతారు" అంటూ కొర కొరా చూస్తూ వెళ్ళాడు. కిందపడ్డ పదార్థాలలోంచి నా పళ్ళు వెదికి కడిగి పెట్టుకున్నాను. ఇక ఆ భోజనం కోసం క్యూలో నిలబడే ఓపికలేక అభోజనంగానే అక్కడ కుర్చీలో కూలబడ్డాను. ఇంతలో మావాడు భోం చేసి వచ్చాడు. "పదండి వెళ్దాం" అన్నాడు.

కార్లో కూర్చుని నీరసంగా కళ్ళు మూసుకున్నాను. నా కళ్ళముందు యాభై ఏళ్ళనాడు జరిగిన నా పెళ్ళి తాలూకు స్మృతి పరిమళాలు, ఆ సువాసనలు కొత్తగా మత్తుగా ఉన్నాయి.

కరంటు లేని కుగ్రామంలో నా పెళ్ళి. అంతా స్వచ్ఛమైన చిరునవ్వులే తప్ప ఇప్పటిలా ప్లాస్టిక్ నవ్వులు తెలీని కాలం. కాగడాల వెలుగులో పెళ్ళి జరిగినా బంధుజనాల కళ్ళలోని కాంతితో పోలిస్తే ఇప్పటి నియాన్ లైట్లు దిగదుడుపే.

కమ్మనైన వంటలతో సహపంక్తి భోజనాలు, ప్రేమ, ఆప్యాయత అనే దినుసులతో వండిన పిండివంటలు కొసరి కొసరి వడ్డింపులు, సుముహూర్తం టైముకి హోరుమని వానపడితే పెళ్ళికూతుర్ని, పెళ్ళికొడుకుని, చంకనేసుకుని పరుగెత్తి మండువా ఇంట్లోనే ముహూర్తం మించకుండా తాళికట్టించారు.

మరునాడు పసుపునలుగులూ, బంతులాటలూను. ముత్యాల పల్లకిలో సిగ్గుల మొగ్గలా ముడుచుకున్న పెళ్ళికూతురు ముగ్ధ సౌందర్యం.

నాకు తెలీకుండానే ఓ చిన్నదరహాసం నా పెదవులపై. ఇవన్నీ కాలగమనంలో కలిసిపోయాయి. అంతా కృత్రిమమే. కాలంతోపాటు మనమూ మారాలిగా మరి.

"తాతా ఇల్లొచ్చింది దిగు" మనవడి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాను.

కొడుకు, కోడలూ, పిల్లాడు నిద్రపోయారని నిర్ధారించుకున్నాక ఫ్రిజ్ తీసి పొద్దున్న కాచిన జావలో కాస్త మజ్జిగ కలుపుకుని తాగి విందుభోజనం చేసినంత పసందుగా తేన్చి ఆత్మారాముణ్ణి సంతృప్తిపరిచాను.

-ఉషాబాల (సికింద్రాబాద్)